సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 30 । డిసెంబర్ । 2023



ఈవీఎంలపై అవగాహన

ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై పూర్తిగా అవగాహన కల్పిస్తామని సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. 8లో



సిరులతల్లికి విశేష పూజలు

విశాఖ: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

విశాఖ: రుషికొండలోని వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో శుక్రవారం శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

గిరి గ్రామాలపై చలి పంజా



ముంచంగిపుట్టులో కమ్మేసిన మంచుతెరల్లో రాకపోకలు

ముంచంగిపుట్టు: మండలంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. గిరిజన గ్రామాలపై చలి పంజా విసురుతోంది. మంచు దట్టంగా కురుస్తుండడంతో రోజువారి పనులకు వెళ్లే కూలీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలి తీవ్రత నెలకొని ఉదయం 10 గంటల వరకు దాని ప్రభావం ఉంటోంది. శుక్రవారం ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడ లేదు. వాహనచోదకులు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు.

తారుమారు సంతకు స్థల పరిశీలన



తారుమారు సంత నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ రాంబాబు తదితరులు

జి.మాడుగుల: సంక్రాంతి పండగ పురస్కరించుకుని మండల కేంద్రంలో వచ్చే నెల 2,9 తేదీల్లో తారుమారు (పండగ) సంత నిర్వహించేందుకు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. స్థానిక వెంకటరాజ్ ఘాట్ వద్ద పొలాలు, ఖాళీ స్థలాలను సర్పంచ్ కిముడు రాంబాబు, మత్స్యరాస నాగరాజు పరిశీలించారు. పాడేరు ఏఎంసీ ట్రెజరర్ అడపా బాబూరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కోనలోవలో ఉద్యానవన పంటలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

అడ్డతీగల: మండలంలోని కోనలోవ, ధాన్యం పాలెం, రాయపల్లి పంచాయతీల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వివిధ రకాల పనులను స్టేట్ మానిటరింగ్ బృందం సభ్యులు కె.స్వరూపారాణి, జేవీ సునీల్ తదితరులు శుక్రవారం పర్యటించారు. 2023–2024లో చేపట్టిన వివిధ రకాలను, ఉద్యానవన తోటల పెంపకాన్ని పరిశీలించారు. ఉపాధిహామీ మండల కార్యాలయంలో ఎంసీసీ, గ్రామ పంచాయతీల రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏపీవో మణికుమారి పాల్గొన్నారు.

ఆయుర్వేదం పరిరక్షణకు కృషి



ఆయుర్వేద మందుల తయారీని వివరిస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: ఆయుర్వేదం ప్రపంచ మానవాళికి ఎంతో మేలుచేసే ఔషధ పరిజ్ఞానంతో కూడిన ఆయుర్వేదం పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చింతూరుకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ అన్నారు. చింతూరులో రెండ్రోజుల పాటు జరిగిన పారంపర్య వైద్యుల మహాసంఘం సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనచుట్టూ ఉన్న ప్రకృతిలో మనకు తెలియని ఔషధగుణాలు కలిగిన వనమూలికలు దాగి ఉన్నాయన్నారు. వాటిని వినియోగించి దీర్ఘకాలిక రోగాలను నయంచేసే అవకాశముందని తెలిపారు. ఈ సదస్సుకు హాజరైన ఆయుర్వేద వైద్యులకు ఆయన తయారు చేస్తున్న ఆయుర్వేద మందులు, కషాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు ఆనందయ్య, జకోటియా సురేష్, చంద్రశేఖరరాజు, ఇమ్రాన్‌ఖాన్, సుభాని పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తికి రిమాండ్

వై.రామవరం: సారా కేసులో వ్యక్తికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ ఎం. సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని రాచపాలెం గ్రామానికి చెందిన వలాల వీరయ్య(39) శుక్రవారం పది లీటర్ల నాటు సారాతో పట్టుబడినట్టు చెప్పారు. అతనిని అరెస్టు చేసి, అడ్డతీగల కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వేదికపై ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ,కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర,జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి,మాజీ మంత్రి బాలరాజు,మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి,ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ వెంకటలక్ష్మి తదితరులు



బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న పార్టీ శ్రేణులు, అభిమానులు

సామాజిక విజయభేరి

- కిక్కిరిసిన హుకుంపేట
- వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన జనం
- వేల సంఖ్యలో రాక
- భారీగా బైక్ ర్యాలీ
- ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మోదకొండమ్మ అమ్మవారి పాదాలను దర్శించుకుంటున్న వైవీ సుబ్బారెడ్డి



సభకు హాజరైన గిరిజనంలో ఓ భాగం

సాక్షి, పాడేరు: మండల కేంద్రమైన హుకుంపేట కిక్కిరిసిపోయింది. శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు వేల సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు, గిరిజనులు తరలిరావడంతో జనసంద్రాన్ని తలపించింది. గిరిజనులంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారని రుజువుచేసింది. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ప్రత్యర్థుల గుండెల్లో వణుకుపుట్టించింది. అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర విజయవంతమైంది. నియోజకవర్గంలోని అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల నుంచి గిరిజనులు బైక్‌లపై బర్మానగుడ తరలి వచ్చారు. ర్యాలీని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి జైజగన్ నినాదాలతో ర్యాలీ హుకుంపేటలో సభా వేదిక వరకు సాగింది. మెయిన్‌రోడ్డు ప్రాంతమంతా గిరిజనులతో నిండిపోయింది. ఎన్నడూలేని విధంగా తరలిరావడంతో మండల కేంద్రమైన హుకుంపేట పరిసరాలు సందడిగా మారాయి. సభా ప్రాంగణం కిక్కిరిసిపోవడంతో ఇళ్లు, చెట్లు, గోడలు ఎక్కి సభను వీక్షించారు.

నాలుగు కిలోమీటర్ల పొడవునా ర్యాలీ..

అనంతగిరి/హుకుంపేట: సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీకి విశేష స్పందన లభించింది. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో అరకు నియోజకవర్గ ముఖ ద్వారమైన బర్మన్‌గూడ నుంచి హుకుంపేటలోని సభ ప్రాంగణం వరకు సుమారు నాలుగు కిలో మీటర్ల పొడవునా వేల సంఖ్యలో బైక్‌లతో ర్యాలీ సాగింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ గొడ్డేటి మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్సీ రవిబాబు, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, నవరత్నాల కోచైర్మన్ నారాయణమూర్తి, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, మాజీ మంత్రి బాలరాజు ర్యాలీలో పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

సామాజిక సాధికార యాత్రలో పులివేషాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విజయనగరానికి చెందిన కళాకారులు పులి వేషధారణలో అలరించారు. ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

- వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం కన్వీనర్, రాష్ట్రక్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ వంగపండు ఉషా బృందంతో ఆలపించిన గీతాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. గిరిజన యువతీ యువకులు నృత్యాలతో అలరించారు.

అమ్మవారి పాదాలవద్ద పూజలు

సాక్షి, పాడేరు: సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన వైఎస్ఆర్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పాడేరు ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మ వారి పాదాలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

వైవీ దృష్టికి సమస్యలు

కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కోరారు.

అందరికీ కృతజ్ఞతలు

అనంతగిరి: సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు,అభిమానులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానాన్ని గిరిజనులు ఈ సభ విజయవంతం ద్వారా తెలియజేశారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేసేందుకు అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



వేదిక వద్దకు పాదయాత్రగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే పాల్గుణ, అమర్‌నాథ్

ద్రోహులు పార్టీని వీడినా నష్టం లేదు

వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, పాడేరు: పదవుల కోసం పాకులాడే నేతలు, పార్టీ ద్రోహులు వైఎస్సార్‌సీపీని వీడినా నష్టం లేదని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హుకుంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంత మంది చంద్రబాబు ట్రాప్‌లో పడ్డారని వారికి ప్రజలతో తగిన గుణపాఠం తప్పదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. హుకుంపేట బస్సుయాత్రకు గిరిజనులంతా బ్రహ్మరథం పట్టారన్నారు. వేల సంఖ్యలో ప్రజలు తరలి రావడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అసలైన గిరిజనాభివృద్ధి జరిగిందన్నారు. గిరిజనుల పక్షపాత పార్టీ వైఎస్సార్‌సీపీయే అన్నారు.

పదవులు ఆశించేవారు పార్టీకి అవసరం లేదు: మంత్రి అమర్‌నాథ్

పదవులు ఆశించే వారు వైఎస్సార్‌సీపీకి అవసరం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. హుకుంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యకర్తలు, అభిమానుల బలంతో వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందన్నారు. పదవులు ఉన్నా లేకున్నా తామంతా వైఎస్సార్‌సీపీ తోనే ఉంటామని ఆయన పేర్కొన్నారు.



సభా ప్రాంగణం కిక్కిరిసి పోవడంతో గట్టుపై నుంచి వీక్షిస్తున్న గిరిజనులు



వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు



వంగపండు ఉష ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శన



వైవీ సుబ్బారెడ్డికి సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ర్యాలీలో ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రవిబాబు, విశాఖ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి

జగనన్నకు చెబుదాంలో
76 వినతుల స్వీకరణ

పాడేరు : స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గిరిజనుల నుంచి 76 వినతులను జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి స్వీకరించారు. వీటిని త్వరితగతిన పరిష్కరించాలని వారు సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.వి.రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి.వి.ఎస్. శర్మ, మురళీకృష్ణ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందర్ బాబు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జేసీ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

అర్జీల్లో కొన్ని..

- మాడెంబంద నుంచి తమ గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని చింతపల్లి మండలం అంజలిశనివారం పంచాయతీ పాలమామిడి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.
- జగనన్న గృహ కల్ప లే అవుట్‌లో రహదారి, విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించాలని పాత పాడేరుకు చెందిన పల్టాసింగి లక్ష్మి, కె. రాములమ్మ అధికారులను కోరారు.
- డుంబ్రిగుడ మండలం రంగలిసింగి పంచాయతీ కుడాబీర్ గ్రామంలో పాడైన బోర్‌ల వెల్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కె. రాము, మల్లేశ్వరరావు వినతిపత్రం అందజేశారు.
- ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందజేయాలని పాడేరు మండలం కుజ్జెలి గ్రామస్తులు, చొడుపల్లి పంచాయతీ గెర్రెలగెడ్డ గ్రామస్తులు వినతిపత్రంలో కోరారు.
- మినుములూరు నుంచి సంగోడి వరకు ఉపాధి పథకంలో రహదారి నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న జల్‌జీవన్ తాగునీటి పథకాన్ని పూర్తి చేయాలని సర్పంచ్ లంకెల చిట్టమ్మ అధికారులను కోరారు.

విద్యార్థినికి
ల్యాప్‌టాప్

సమకూర్చిన నేను సైతం చారిటబుల్ ట్రస్ట్



విద్యార్థిని జయశ్రీసాయిమేఘనకు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సాక్షి,పాడేరు: ఇంటర్‌లో 97శాతం మార్కులు సాధించి, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఐఐటీ చదువుతున్న పెదబయలు మండలం గంపరాయికి చెందిన కె.జయశ్రీసాయిమేఘనకు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ల్యాప్‌టాప్‌ను అందజేశారు. అనంతరం ఆమెను అభినందించారు. రూ.50 వేల విలువైన ఈ ల్యాప్‌టాప్‌ను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి భర్త, నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శివప్రసాద్ సమకూర్చారు.

11,622 మందికి
విద్యాదీవెన లబ్ధి

- తల్లుల ఖాతాల్లో రూ.5.65 కోట్ల జమ
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకానికి సంబంధించి 11,622 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.5కోట్ల 65లక్షల 9వేల 829లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేశారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.విద్యా దీవెన నాల్గవ విడత ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని సీఎం శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ప్రారంభించిన కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుంచి లబ్ధిదారులు వీక్షించారు.అనంతరం విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయాన్ని నమూనా చెక్కు రూపంలో కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికసాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువుల్లో రాణించాలన్నారు.విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచి విదేశీ విద్య వరకు వివిధ పథకాలను అమలుజేస్తుందన్నారు. విద్యకు పేదరికం అడ్డురాకూడదని ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు.తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.జిల్లాలో 390మంది ఎస్సీ, 9,669 మంది ఎస్టీ,1.173 మంది బీసీ,108 మంది ఈబీసీ, 233 మంది కాపు, 39మంది ముస్లిం మైనారిటీ, పది మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వం విద్యా దీవెనను అమలుజేసిందని కలెక్టర్ పేర్కొన్నారు.



జగనన్న విద్యాదీవెన నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

విశాఖ మీదుగా అమృత్ భారత్ రైలు



తాటిచెట్లపాలెం : అమృత్ భారత్ విశాఖ మీదుగా పరుగులు తీసేందుకు సిద్ధమైంది. రెండు అమృత్ భారత్ రైళ్లను శనివారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. వీటిలో ఒకటి మాల్దా టౌన్-ఎస్ఎంవీ బెంగళూరు-మాల్దా టౌన్ అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ విశాఖ మీదుగా రాకపోకలు సాగించనుంది. ఆదివారం మధ్యాహ్నం 11.03 గంటలకు శ్రీకాకుళం, 11.48 గంటలకు విజయనగరం, 1.45గంటలకు విశాఖ చేరుకోనుంది. అమృత్ భారత్ రెగ్యులర్ రైలు మాత్రం జనవరి 7వ తేదీ నుంచి నడవనుంది.

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు

అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

నర్సీపట్నం : జిల్లాలో గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం రాత్రి నర్సీపట్నం ఏఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా సబ్ డివిజన్‌లో ప్రధాన సమస్యలతో పాటు క్రైమ్ వివరాలను ఏఎస్పీ అధిరాజ్ సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన తర్వాత అనకాపల్లిలో గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించామన్నారు. అల్లూరి జిల్లా నుండి రవాణా అవుతున్న గంజాయిని అరికట్టేందుకు ప్రస్తుతం 4 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. మరో ఐదు చెక్‌పోస్టుల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గతంలో గంజాయితో పట్టుబడిన ఇద్దరిపై పీడీ యాక్టు నమోదు చేశామన్నారు. అల్లూరి జిల్లాలో గతంలో 7,500 ఎకరాల్లో గంజాయి సాగు చేసేవారన్నారు. ఎస్ఈబీ, పోలీసు సమన్వయంతో దీనిని నిర్మూలించామన్నారు. గంజాయి సాగు చేసే ప్రాంతంలో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. గంజాయి రవాణాతో పాటు సారా నిర్మూలనపై ఎస్ఈబీ, పోలీసుల సమన్వయంతో ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నామన్నారు. సారా తయారీ, రవాణా గల గ్రామాలు జిల్లాలో 346 ఉండేవన్నారు. ఆయా గ్రామాల్లో పోలీసులు దాడులు నిర్వహించి సారా తయారీ, రవాణా చేయకుండా ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 207 మందికి ప్రభుత్వం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. దీంతో 16 గ్రామాల్లో మాత్రమే సారా ప్రభావం ఉందన్నారు. తరచూ వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయటం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ఎన్నికల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. రౌడీషీటర్లలో పరివర్తన వచ్చేలా కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీయాక్టు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. పోలీసుల కౌన్సెలింగ్ అనంతరం వారిలో మార్పు రాకపోతే బహిష్కరిస్తామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు నాబార్డు కృషి

డీజీఎం అబువరజాన్



దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న అబువరజాన్, ఎంపీపీ రాజు

రావికమతం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నాబార్డు కృషి చేస్తోందని డీజీఎం అబువరజాన్ అన్నారు. కొత్తకోటలో నాబార్డు నుంచి రూ.15 లక్షలు, పంచాయతీ నుంచి రూ.5 లక్షలతో నిర్మించిన దుకాణ(మార్కెట్) సముదాయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పట్టణాల్లో, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఏటా రూ.2,500 కోట్లు నుంచి రూ.5 వేల కోట్లు వరకూ నిధులిస్తున్నామన్నారు. రోడ్లు, స్కూళ్ల అభివృద్ధితోపాటు ఇటువంటి మార్కెట్ సదుపాయాలు, గిడ్డంగులు, శీతలీకరణ గోదాముల నిర్మాణానికి సహాయ సహకారాలందిస్తామన్నారు. కొత్తకోట, చింతపల్లిలో గిరిజన వికాస్ సంస్థ ద్వారా రూ.30 లక్షలతో మార్కెట్ సముదాయాలు నిర్మించామన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా దీనిని పంచాయతీ నిర్వహించుకోవాలన్నారు. ఒకప్పుడు విస్తరి కేంద్రమైన కొత్తకోటలో మార్కెటింగ్ ఎక్కువగా ఉంటుందన్నారు. ఇక్కడ త్వరలోనే శీతల గిడ్డంగి, సరుకు నిల్వ గోదాము ఏర్పాటుకు పరిశీలిస్తామన్నారు. సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా కోరిక మేరకు మార్కెట్‌కు ప్రహరీ నిర్మాణానికి నిధులిస్తామని హామీ ఇచ్చారు. ఏజీఎం సుమంత్‌కుమార్, ఎంపీపీ పైల రాజు, గిరిజన వికాస్ ఎన్జీవో సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థులకు ఎంఎస్ఎంఈలో శిక్షణ.. ఉపాధి

తుమ్మపాల : బీటెక్ (మెకానికల్) పూర్తిచేసి 18 నుండి 26 సంవత్సరాల వయసు గల యువతీ, యువకులకు అచ్యుతాపురంలో గల ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ద్వారా ఉచిత శిక్షణ, ఉపాధి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రాజెక్టులో నిరుద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసి మూడు నుంచి ఆరు నెలల పాటు సాంకేతిక శిక్షణతో పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9492429425 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రేపు పశుసంవర్ధక సహాయకుల పోస్టుకు పరీక్ష

మహారాణిపేట : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు సంవర్ధక సహాయకుల పోస్టుల పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలని జేసీ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశు సంవర్ధక శాఖ, పోలీస్, విద్యుత్, వైద్య, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. జిల్లా నుంచి 1708 మంది, ఇతర జిల్లాల నుంచి 1641 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



హర్యానాలో మృత దేహానికి ఆర్మీ అధికారుల గౌరవ వందనం



సహదేవుడు (ఫైల్)

మాకవరపాలెం: గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి చెందారు. మండలంలోని గిడుతూరుకు చెందిన మట్ల సహదేవుడు(45) ఆర్మీలో హవాల్దార్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం హర్యానాలో పనిచేస్తున్న ఈయన గురువారం విధుల్లో ఉండగా గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో అక్కడే ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలు ముగించి భౌతిక కాయాన్ని స్వగ్రామం తరలించారు. ఈ మేరకు శుక్రవారం గిడుతూరులో సైనిక లాంఛనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

సంత షెడ్లను సద్వినియోగం చేసుకోండి



సభలో మాట్లాడుతున్న నాబార్డు డీజీఎం అభువరాజన్ తదితరులు

చింతపల్లిరూరల్: వ్యాపారస్తులు సంత షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీజీఎం అభువరాజన్ అన్నారు.మండలం కేంద్రంలో నూతనంగా నిర్మించిన సంత షెడ్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ. 15 లక్షలు, పంచాయతీ నిధులు 5 లక్షలతో 40 షెడ్ల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. వీటితో పాటు గోడౌను, బాత్‌రూములు నిర్మించినట్టు తెలిపారు. వీటి వలన పంచాయతీకి మంచి ఆదాయం సమకూరుతుందని, వాటిని ఉపయోగించి మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఏజీఎం సమంత కుమార్, తహసీల్దార్ లచ్చుపాత్రుడు, గిరిజన వికాస్ కార్యదర్శి సత్యనారాయణ, వర్తక సంఘం నాయకుడు బేతాళుడు, కో-అప్షన్ సభ్యులు నాజర్‌వలీ, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజ్‌కుమార్



సమావేశానికి హాజరైన రైతులు

అరకులోయటౌన్: వ్యవసాయ పంట మార్పిడి విధానాలపై రెండు రోజులు శిక్షణ తరగతులను అవగాహన చేసుకోవాలని అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల వ్యవసాయ సహాయకులకు ఈ నెల 29, 30 తేదీల్లో ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చిట్టిబాబు, వెంకటరావు, రాజ్‌కుమార్‌లు సూచించారు. అరకులోయ మండలంలోని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ కె.వి.పి.కొండపూడి శాస్త్రవేత్త పి.బాబు మాట్లాడుతూ పంట మార్పిడి ప్రాజెక్టులపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత గ్రామంలో శుక్రవారం గిరి రైతులకు ఆయిల్ పామ్ తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక రైతు కాకర లోవరాజు తోటలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దాపురం నుంచి వచ్చిన పతంజలి ఫుడ్స్ డీజీఎం ఏఎస్. ప్రకాశ్ ఆయిల్ పామ్ తోటల పెంపకం, ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలు, బిందు సేద్య, ఎరువుల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. లాభసాటిగా ఉన్న ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులు కృషి చేయాలని కోరారు. సర్పంచ్ సూరిబాబు, వీఏఏ ప్రియదర్శిని, ఫీల్డ్ స్టాఫ్ దుర్గాప్రసాద్, నరేష్, సతీష్, నానాజి, శివకృష్ణ పెద్ద ఎత్తున రైతులు వచ్చారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

రంపచోడవరం: అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకెఎంఎస్) డివిజన్ 19వ మహాసభ రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించారు.మహాసభలో ఏఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు పి టాన్యా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కౌలు రైతులు సమస్యలు పట్టించుకోవడం లేదని, పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వలేదన్నారు. గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తుల ధరలు పెంచకుండా అన్యాయం చేస్తుందన్నారు. సంఘం తరపున రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రంపచోడవరం డివిజన్ అధ్యక్షుడిగా కె.బాలుదొర, ప్రధాన కార్యదర్శిగా పి.లచ్చిరెడ్డితో పాటు 13 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. చిట్టిబాబు, లక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై పూర్తి అవగాహన కల్పిస్తామని సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈవీఎంలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తహసీల్దార్ జయకుమార్, డీటీలు సత్యనారాయణ, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్, ఇందిరాబాయ్, బ్రహ్మం పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

చింతపల్లి రూరల్: చింతపల్లిలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధికారి (డీఐఈవో) అప్పలరాము ఆధ్వర్యంలో మెడ్‌ప్లస్, షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. యువత 32 మంది హాజరు కాగా 14 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్, వార్డెన్ పసుపులేటి వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలకు డిమాండ్

ఎటపాక: దళిత కుటుంబాలు సాగుచేసుకుంటున్న భూములను గిరిజనులకు తప్పుడు హక్కు పత్రాలు ఇప్పించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లింగాలపల్లి వాసులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని లక్ష్మీపురం వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములను అన్యాయంగా గిరిజనేతరులకు హక్కు పత్రాలు వచ్చేలా సహకరించిన గ్రామ రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేసి తమ భూములు తమకు ఇప్పించేలా న్యాయం చేయలని కోరారు.

అధికారుల పనితీరుపై పీవోకు ఫిర్యాదు

చింతూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవలం అమల అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ అమల, వైస్ ఎంపీపీలు యడమ అర్జున్, మేడేపల్లి సుధాకర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. సర్వసభ్య సమావేశాల్లో సమస్యలు తెలియజేసేందుకు అధికారులు హాజరు కావడం లేదని, దీంతో ప్రజలకు జవాబు చెప్పలేని పరిస్థితి ఉంటుందన్నారు. అనంతరం వారు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యను కలిసి సమావేశాలకు గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. దీనిపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరి తగిన చర్యలు చేపడతానని పీవో ప్రజా ప్రతినిధులకు హామీనిచ్చారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



పులుపును ధ్వంసం చేస్తున్న పోలీసు

కొయ్యూరు: రాజేంద్రపాలెం శివారులో నిర్వహిస్తున్న సారా బట్టీలపై శుక్రవారం ఎస్ఐ రాజారావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. సుమారు 400 లీటర్ల బెల్లం పులుపు, సారా పాత్రలను ధ్వంసం చేశారు. ఈ కేసులో దిబ్బల క్రిని 20 లీటర్ల సారాతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.